విద్యుత్ సబ్ స్టేషన్‌కు స్థలం కేటాయించాలి

విశాలాంధ్ర – కూర్మన్నపాలెం: అగనంపూడి పునరావాస కాలనీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు స్థలం కేటాయించాలని కోరుతూ గాజువాక తహశీల్దార్ తోట శ్రీవల్లిని ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ కలిసి వినతి అందించారు. అగనంపూడి ఉక్కు పునరావాస కాలనీలో 16 గ్రామాలలో సుమారు 40 వేల మంది జీవనం సాగిస్తున్నారని లో ఓల్టేజి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈపీ డీసీఎల్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా సబ్ స్టేషన్ ఏర్పాటుకు అంగీకరించారని కావునా 208 సర్వే నెంబర్‌లో స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ నిర్వాసిత నాయకులు కసిపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డ్రగ్స్ స్మగ్లింగ్‌లో ఏపీ నెం.1

ఇంతకీ విశాఖలో దొరికిన డ్రైఈస్ట్ సంగతేంటి...?



విశాలాంధ్ర – విశాఖ క్రైం: డ్రగ్స్ స్మగ్లింగ్‌లో ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్ అని అత్యధిక స్థాయిలో మాదకద్రవ్యాలు పట్టుబడినట్టు ఇదివరకే డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) ఓ నివేదికను విడుదల చేసింది. 2021-22లో మొత్తం 28,334.32 కేజీల మాదకద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాలను స్వాధీనం చేసుకోగా, అందులో 18,267.84 కేజీలు ఆంధ్రప్రదేశ్‌లోనే దొరికినట్టు డీఆర్ఐ నివేదిక తెలిపింది. ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ దొరికింది ఏపీలోనే. తరువాతి స్థానాల్లో త్రిపుర (10104.99 కేజీలు), అస్సాం (3633.08 కేజీలు), తెలంగాణ (1012.04 కేజీలు) ఉన్నాయి. అయితే తాజాగా విశాఖపట్నం పోర్టుకు బ్రెజిల్ నుంచి చేరిన 25 వేల కేజీల డ్రగ్ కంటైనర్ రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇప్పటివరకు రాష్ట్రంలో ఇలాంటి కంటైనర్‌కు సంబంధించిన వార్తలు వినడమే తప్ప చూసింది లేదు. ఇంటర్ పోల్ నిఘాలో డ్రైఈస్ట్ ముసుగులో డ్రగ్స్ రవాణా కథ వెలుగు చూడటంతో యావత్ భారతదేశం కంగుతింది. విశాఖలో పట్టుబడిన డ్రగ్స్ వ్యవహారంలో డ్రైఈస్ట్ ఎక్కువగా ప్రచారంలోకి వస్తోంది. అసలు డ్రై ఈస్ట్ ఏమిటి ? చెత్త అయితే బ్రెజిల్ నుంచి తెచ్చుకోవడం ఎందుకు ? బ్రెజిల్ నుంచి దిగుమతులు చేసుకున్న డ్రైఈస్ట్ అనే పదార్థం మాటున పెద్దఎత్తున కొకైన్ తరలించారని సీబీఐ అధికారులు గుర్తించి పట్టుకున్నారు. అసలు ఈ డ్రైఈస్ట్ అంటే ఏమిటి అన్నది ఇప్పుడు కీలకంగా మారింది. డ్రై ఈస్ట్ అంటే సులభమైన భాషలో చెప్పాలంటే చెత్త అని అర్థం. చెత్తను బ్రెజిల్ నుంచి దిగుమతి చేసుకోవాలా అంటే.. అక్కడే ఉంది అసలు గుట్టు.

ఇంతకీ విశాఖలో దొరికిన డ్రైఈస్ట్ సంగతేంటి?

డ్రై ఈస్ట్ పదార్థం అంటే మిగిలిపోయిన చెత్త. ఓ వ్యర్థ పదార్థంలో ఉత్పత్తి. కుళ్లిన తియ్యని పండ్లు, ఆహార పదార్థాల నుంచి డ్రైఈస్ట్ తయారవుతుంది. యూరప్ దేశాల్లో మిగిలిన ఆహార పదార్థాలను ఉచితంగా ఇచ్చేస్తారు. ఈ పదార్థాల నుంచి డ్రైఈస్ట్ తయారు చేసిన కంపెనీలు చాలా చౌకగా విక్రయిస్తాయి. దీంతో ఐరోపా దేశాల నుంచి డ్రైఈస్ట్‌ను భారతీయ కంపెనీలు దిగుమతి చేసుకుంటాయి. ఎందుకంటే... పశువుల మేతకు, చేపలు, రొయ్యల మేతకు డ్రైఈస్ట్‌ను ఉపయోగిస్తారు. ఈ డ్రైఈస్ట్‌లో ప్రొటీన్లు, సీ విటమిన్లు, భాస్వరం, అమినో ఆమ్లాలు ఉంటాయి. అంతే కాదు, డ్రైఈస్టును ఆల్కాహాల్ తయారీలోనూ వినియోగిస్తారు. అంటే బేవరేజెస్ కూడా డ్రైఈస్ట్ కోసం క్యూకడతాయన్న మాట. అయితే విశాఖ పోర్టులో పట్టుబడిన డ్రై ఈస్ట్ విషయంలో లోతుగా వెళ్తే డ్రై ఈస్ట్‌లోని నీటి శాతాన్ని అధిక సెంటిగ్రేట్ వద్ద వేడి చేసి తొలగిస్తే ఈ ఫంగస్ గుళికల మాదిరిగా ఏర్పడుతుందని, దీనిని పౌడర్‌గా మార్చి వైను, రొట్టెల తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తారని, డ్రై ఈస్ట్ హై న్యూట్రిషన్ ఫుడ్ కావడంతో చేపలు, రొయ్యలకు మేతగా ఉపయోగిస్తారని, చూడ్డానికి తెల్లగా ఉండే ఈ పౌడర్లో ఎలాంటి డ్రగ్ పౌడర్ కలిపిన అనుమానం రాదని కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్లు చెబుతున్నారు. దీనిని తిరిగి వేరు చేయాలంటే కెమికల్ ఫార్ములా ఉపయోగించాల్సి ఉంటుదని గోరువెచ్చని నీటిలో సోడియం హైడ్రాక్సైడ్ వేసి ఈ పౌడర్‌ను అందులో మిక్స్ చేస్తే దీంతో డ్రై ఈస్ట్ పౌడర్ పౌడర్‌గా అడుక్కు చేరగా డ్రగ్ పౌడర్ గడ్డలు గడ్డలుగా పైకి తేలుతుంది. బహుశా ఈ ఫార్మేట్‌నే స్మగ్లర్లు ఉపయోగించి ఉండవచ్చు అని కెమికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దేశంలోనే సంచలనం సృష్టించిన ఈ డ్రగ్ వ్యవహారంలో ప్రస్తుతం ఫొరెన్సిక్ నివేదికే కీలకంగా మారనుంది. డ్రై ఈస్ట్ పౌడర్‌లో కొకైన్ పౌడర్ మిక్స్ అయిందా.. లేదా.. అన్న విషయం తేలాల్సి ఉంది. ఒకవేళ మిక్స్ అయి ఉంటే కెమికల్ ఫార్మేట్ ద్వారా దానిని వేరుచేసి విలువ కడతారు. ఏది ఏమైనా కేసులో సిబిఐ అధికారులు మరింత పురోగతి సాధించాలి అంటే ఫారెన్సిక్ ల్యాబ్ రిపోర్ట్ తొందరగా రావాల్సి ఉంది.

భగత్ సింగ్‌కు ఘన నివాళులు

విశాలాంధ్ర – విశాఖ : భగత్ సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా అరసం, భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ప్రతినిధులు శనివారం విశాఖ బీచ్‌లోని భగత్ సింగ్ విగ్రహం వద్ద నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు మాట్లాడుతూ భగత్ సింగ్ నిజమైన దేశభక్తుడని, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తన ప్రాణాలను బలి ఇచ్చిన గొప్ప త్యాగశీలి అని అన్నారు, భారత నాస్తిక సమాజం సభ్యులు టి.శ్రీరామ్మూర్తి, నూకరాజు, రవి, శ్యామ్ సుందర్ మధుబాబు, రాంప్రభు విజ్ఞానంద్‌లు భగత్ సింగ్ త్యాగాలను గుర్తుచేస్తూ నినాదాలు చేశారు. సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ గ్రూనో, సునీతలు భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నివాళులర్పించారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధులు, విప్లవ యువకిశోరాలు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 93వ వర్ధంతిని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సీతంపేటలోని శ్రీ కాశ్యప్ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించారు. భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురుల చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల పోరాట స్ఫూర్తితో విద్యార్థి, యువజన సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామన్నారు. అతి చిన్న వయసులో వారు దేశ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన రియల్ హీరోలని కొనియాడారు. దేశానికి వెన్నెముకలాంటి రైతులు సైతం ఆందోళన బాట పట్టే విధంగా చేసిన నరేంద్ర మోడీ చరిత్ర హీనుడుగా నిలిచిపోతారన్నారు. భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థులకు భగత్ సింగ్ జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు శేఖర్, కిరణ్, భవాని, ఏఐవైఎఫ్ నాయకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తగరపువలసలో స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ 93వ వర్ధంతిని తగరపువలసలోని జిఆర్ భవన్‌లో శనివారం నిర్వహించారు. కానూరి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అల్లు బాబురావు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం భగత్ సింగ్ అనేక పోరాటాలు చేసి బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించారని అన్నారు. మోర అప్పలరాజు మాట్లాడుతూ అతి చిన్న వయసులో దేశ స్వాతంత్రం కోసం సాయుధ పోరాటం చేసి ఉరికొయ్యను ముద్దాడిన విప్లవ యోధుడు భగత్ సింగ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు కొండపు ఈశ్వరరావు, రాం పైడి, మావూరి వీర్రాజు, వానపల్లి సత్యం, నూలు నారాయణ, అల్లం గోవింద్, గిడుతూరి సూరిబాబు, సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: సర్దార్ భగత్ సింగ్ 93వ వర్ధంతిని 63వ వార్డు పరిధిలో గల కాకరలోవ కూడలిలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి సీపీఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు గుడాల రాంబాబు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుడాల రాంబాబు మాట్లాడుతూ దేశం కోసం అతి చిన్న వయసులోనే ప్రాణాలను తృణప్రాయముగా అర్పించిన భగత్ సింగ్‌ను భారతీయులంతా ఆదర్శంగా తీసుకోవాలన్నారు. స్వాతంత్ర్యం సాధించిన విజయాలను రాజ్యాంగాన్ని లౌకిక ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓడించడమే విప్లవవీరులకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎన్‌వి త్రినాథ్, జి.రామకృష్ణ, వై.కనకేశ్వరరావు, సురేష్, టి.కామేశ్వరరావు, డి.గోపి, ఆర్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన బంటా కాలనీవాసులు

విశాలాంధ్ర – పెందుర్తి: జీవీఎంసీ 92వ వార్డు బంటా కాలనీకి చెందిన కదారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు శనివారం ఉదయం వైసీపీలో చేరారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అదీప్ రాజ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి ధైర్యంగా ఓట్లు అడిగేందుకు ప్రజల ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమం అభివృద్ధిని సముపాలలో పాలన సాగిస్తున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బెహరా భాస్కరరావు, వైసిపి నాయకులు గోవింద పట్నాయక్, ఆదిరెడ్డి మురళి, గండి రవికుమార్, బల్ల రాంబాబు, దాసరి సత్తిబాబు కంచిపాటి జగదీష్, జవాన్ శంకర్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర – విశాఖ: కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అడ్డూఅదుపూ లేకుండా పెట్రోలు, డీజిల్ ధరలను భారీగా పెంచడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగి ఆటో, మోటార్ కార్మికులపై ఆర్థిక భారాలు పడ్డాయని ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి సిహెచ్.కాసు బాబు అన్నారు. అల్లిపురం నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో శనివారం ఏవీఎన్ కాలేజీ ఆటో స్టాండ్ డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రమాదాల నివారణ పేరుతో నూతన రవాణా భద్రతా చట్టం జీవో నెంబర్ 21ని తీసుకురావడం వల్ల వందల్లో ఉన్న ఫైన్లు వేలల్లోకి, వేలల్లో ఉన్న ఫైన్లు 10 వేల నుండి లక్ష రూపాయలు దాకా పెంచారని విమర్శించారు. ఆటో కార్మికులంతా డ్రైవర్ యూనిఫామ్ ధరించి సకాలంలో రికార్డులన్నీ రెన్యువల్ చేయించుకోవాలని కోరారు. పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రమాదాలుకు గురికాకుండా ఆటో నడపాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదంలో డ్రైవర్ చనిపోతే 10లక్షలు, సహజ మరణానికి 5లక్షలు వచ్చే విధంగా ఉచిత ఇన్సూరెన్స్ పాలసీతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేని ఫెస్టోలో ఈ అంశాన్ని పెట్టిన వారికే ఆటో మోటార్ కార్మికులు మద్దతు ఉంటుందని తెలిపారు. జీవో నెంబర్ 21, భారీగా పెరిగిన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోజువారీ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, ధరలను పెరిగిన ఆర్టీఏ చలానా ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులుగా సిహెచ్. సాయికుమార్, అధ్యక్షులుగా టి.కృష్ణ, ఉపాధ్యక్షులుగా వి.హరీష్, సెక్రెటరీగా ఎండి మస్తాన్, జాయింట్ సెక్రటరీగా ఎం.క్రాంతి, కోశాధికారి షేక్ బురాన్, కమిటీ మెంబర్స్ గా యహీయా, నిమ్మకాయ శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

భూములను అమ్ముకోవద్దు: ముత్తంశెట్టి

విశాలాంధ్ర – పద్మనాభం: పద్మనాభం మండలంలో స్థానిక ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావు ఆరవ రోజు ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక ఎంపీపీ కే.రాంబాబు ఆధ్వర్యంలో బందేపురం, విలాస్ఖనపాలెం పంచాయతీల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఐదు సంవత్సరాల్లో ఈ రెండు పంచాయతీలకి సుమారు 20 సార్లు పైగా వచ్చానని ప్రజల సమస్యలు గడపగడపకు వెళ్లి తెలుసుకున్నానని సాధ్యమైనంత వరకు ప్రతి సమస్యను పరిష్కరించానని అన్నారు. మరలా మన ప్రభుత్వమే వస్తుందని, విశాఖపట్నం పరిపాలన రాజధాని అవుతుందని జగన్మోహన్ రెడ్డి ఇక్కడి నుంచే పరిపాలన సాగిస్తారని కాబట్టి ఎవరు భూములు అమ్ముకోవద్దని, మధ్యవర్తులు దళారులు మాటలు నమ్మి భూములను అమ్ముకోవద్దని అన్నారు. రాజధాని మనకి అందుబాటులో ఉండటం వల్ల మన మండలం, మన గ్రామాలు మరింత అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైసీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర – విశాఖ కలెక్టరేట్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగర పరిధిలోని చినగదిలి వద్ద గల ఈవీఎం గోదాములను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున శనివారం తనిఖీ చేశారు. ప్రతి మూడు మాసాలకు చేసే తనిఖీలో భాగంగా గోదాములను సందర్శించి అక్కడ పరిస్థితిని నిశితంగా పరిశీలించారు. వివిధ పార్టీల ప్రతినిధులతో కలిసి గోదాముల లోపల గల వీవీ ప్యాడ్‌లను, ఇతర సామగ్రిని స్వయంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును గమనించిన ఆయన సిబ్బందికి, అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రతా ప్రమాణాల్లో ఎటువంటి లోపం ఉండరాదని, అందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు, భీమిలి ఆర్.డి.ఓ ఎస్.భాస్కర్ రెడ్డి, రూరల్ మండల తహశీల్దార్ ఎం.శివన్నారాయణ, జిల్లా సహకార అధికారి టి.ప్రవీణ, ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చెడ్డి గ్యాంగ్ హల్‌చల్

విశాలాంధ్ర – ఆనందపురం మండలంలో మచ్చవానిపాలెం గ్రామం వద్ద ముగ్గురు చెడ్డి గ్యాంగ్ ముఠా హల్‌చల్ చేశారు. దారిలో కనిపించిన వారిపై జులం విసురుతూ రాత్రి 11 గంటల సమయంలో గ్రామ ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సుమారు నాలుగు వాహనాల్లో పటిష్ట బందోబస్తుతో చేరుకునేసరికి మాయం అయిపోయారు. ఇటీవల చెడ్డిగ్యాంగ్ హైదరాబాద్ నుంచి విశాఖకు వచ్చినట్లు పోలీసులు అయితే వారి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఇదివరకే సమాచారం అందించారు. కానీ ఈ గ్యాంగ్ ఏ టైంలో ఎలా వస్తారు ఎవ్వరికి అంతు పట్టట్లేదు. రాత్రి అయితే ప్రజలు నిద్రపోకుండా కావలా కాసే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా గ్యాంగ్‌ను పట్టుకోవాలని ప్రజలు పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

బయోమెడికల్ రీసెర్చ్‌పై ముగిసిన గీతం వింటర్ స్కూల్

విశాలాంధ్ర – మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన మల్టీడిసిప్లినరీ యూనిట్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ ట్రాన్స్‌లేషనల్ ఇనిషియేటివ్స్ (మూర్తి) పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో మాస్ స్పెక్ట్రో మెట్రి సదుపాయాన్ని ఉపయోగించుకుని బయోమెడికల్ పరిశోధ నలలో ఏ విధంగా ప్రాజెక్టులను నిర్వహించవచ్చో తెలియజేస్తు అధ్యాపకులకు నాలుగు రోజులుగా జరుగుతున్న వింటర్ స్కూల్ శనివారం ముగిసింది. గీతం ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వీరేంద్ర సింగ్ చౌహాన్, గీతం వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ పి.బలరామ్ హాజరై దిశానిర్దేశం చేశారు. శరీరంలోని రక్త నమూనా ఆధారంగా మాస్ స్పెక్ట్రో మెట్రి ఉపయోగించి రోగ లక్షణాలను ఎలా గుర్తించవచ్చో ప్రొఫెసర్ రీటా క్రిస్టోఫర్ తెలియజేసారు. ప్రొఫెసర్ హేమలత బలరామ్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య రంగంలో మాస్ స్పెక్ట్రో మెట్రి ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో గీతం ప్రోవైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, బాబా అణుశక్తి పరిశోధన కేంద్రం (బార్క్) విశ్రాంత శాస్త్రవేత్త, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశిష్ట ప్రొఫెసర్ బి.వి.ఆర్.టాటా, ప్రోగ్రామ్ డైరక్టర్ ప్రొఫెసర్ జి.వి.ఆర్.శర్మ పాల్గొని సర్టిఫికెట్‌లను అందజేసారు.

గాజువాకను విశాఖకు ధీటుగా అభివృద్ధి చేస్తా
మంత్రి గుడివాడ అమర్నాథ్

విశాలాంధ్ర – గాజువాక: ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసిన రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గాజువాక నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి గుడివాడ అమర్నాథ్ వార్డు స్థాయి సమావేశాలను నిర్వహిస్తున్నారు. శనివారం 69వ వార్డు నాతయ్య పాలెంలో వైసీపీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ తనను గెలిపిస్తే అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తానని విశాఖకు ధీటుగా గాజువాకను అభివృద్ధి చేస్తానని చెప్పారు. ఈ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి గెలుపు చాలా అవసరమని అన్నారు. గత ఎన్నికల్లో 151 మంది వైసిపి అభ్యర్థులను గెలిపించి, జగన్మోహన్ రెడ్డికి అధికారం ఇచ్చారని, ఎన్నికల సమయంలో ఆయన ఇచ్చిన హామీలను 98 శాతానికి పైగా నెరవేర్చి ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్నారని చెప్పారు. అటువంటి వ్యక్తిని మళ్లీ గెలిపిస్తేనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతుందన్నారు. గడిచిన ఐదు సంవత్సరాలలో గాజువాక నియో జకవర్గంలో 500 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారంటే ఈ ప్రాంతంపై జగన్మోహన్ రెడ్డికి ఎంత అభిమానం ఉందో అర్థం చేసుకోవచ్చని ఆయన అన్నారు. గాజువాక ఎమ్మెల్యే, ఉమ్మడి విశాఖ జిల్లాల వైసిపి డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో అమర్నాథ్‌ను గెలిపిస్తే అభివృద్ధిని వరుగులు తీయిస్తారని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకుడు దేవన్ రెడ్డి, 69వ వార్డు ఇన్‌చార్జ్, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ భోగాది సన్యాసిరావు, గంట్రెడ్డి రామానాయుడు, మొల్లి చిన్న, పిలక రమణ, రంగనాయకులు, మున్నిషా బేగం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలి

విశాలాంధ్ర – ఆనందపురం: మండలం ఆనందపురం గ్రామంలోని ఎస్సీ బీసీ కాలనీ పరిధిలో గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారఇంపై అవగాహన కల్పించారు. పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆకుకూరలు ఐరన్, క్యాల్షియంలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భీమిలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సి డి పి ఒ శ్రీదేవి, సూపరవైజర్ వెంకటరత్నం, ఆనందపురం గ్రామ అంగన్వాడి టీచర్ కాసులమ్మ, ఎస్‌సి బీసీ కాలనీ టీచర్ పి.పద్మావతీ ఆనందపురం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రూ.100 ఎందుకు చెల్లదు

పాత వంద నోటు తీసుకోకుండా రోగులను వేధించిన మెడికల్ షాప్ నిర్వాహకులు

విశాలాంధ్ర – విశాఖ సిటీ: పాత వంద రూపాయల నోటు తీసుకునేది లేదంటూ నగరంలోని ఓ మెడికల్ షాప్ నిర్వాహకులు మందులు కొనుక్కోడానికి వచ్చిన రోగులకు చుక్కలు చూపించారు. అత్యవసరమైన పరిస్థితుల్లో మందులకి వచ్చామని తమ వద్ద ఆ నోట్లు మాత్రమే ఉన్నాయని తీసుకొని మందులు ఇవ్వండి అంటూ ఎంత బతిమిలాడినా.. ససేమేరా అంటూ పొమ్మన్నారు. వివరాల్లోకి వెళితే నగరంలోని ద్వారకానగర్ మూడవ లైన్‌లో ఉన్న అనుపమ ఫార్మసీ మందుల షాపు వద్దకు శనివారం ఉదయం ఓ మహిళ వచ్చారు. డాక్టర్ రాసిన మందుల చీటీ చూపించి ఆ మందు కావాలన్నారు. దానికి గాను ఆమె ఒక వంద రూపాయలు నోటును మెడికల్ షాపు నిర్వాహకులకి అందజేస్తే ఇది తీసుకోమంటూ వేరొకటి ఇవ్వాలంటూ పట్టుపట్టారు. అది పాత వందనోటని, అది చెల్లదంటూ వాగ్వివాదానికి దిగారు. ఆ మహిళ తన వద్ద వేరే నోటు లేదని తనకి ఆ మందులు అత్యవసరమని ఎంత చెప్పినా, బ్రతిమిలాడిన వినిపించుకోకుండా పొమ్మన్నారు. ఆ పక్కనే ఉన్న ఆసుపత్రి వద్ద ఉన్న కొంతమంది రోగులు ఈ వివాదాన్ని చూసి మెడికల్ షాప్ నిర్వాహకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఆ మెడికల్ షాప్‌లో ఉన్న ముగ్గురు మహిళలు వినిపించు కోలేదు. అంతటితో ఆగకుండా మందులు కావాలంటూ అలాంటి పాత వంద నోట్లు ఇచ్చిన వారందరి దగ్గర తీసుకోకుండా గొడవకు దిగారు. వారితో గొడవ పడకుండా చాలామంది కొత్త వందనోట్లు ఇచ్చి మందులు తీసుకొని వెళ్ళిపోయారు. దీనిపై మెడికల్ షాపు యాజమాన్యాన్ని వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

పాత 100 నోట్లు చెల్లవనే వదంతులు నమ్మొద్దు

పాత వంద రూపాయల నోటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రద్దు చేసిందని, మరికొద్ది రోజుల్లో రద్దు చేయబోతుందని పలు వదంతులు ఇటీవల కాలంలో వ్యాప్తి చెందుతున్నట్టు కొంతమంది బ్యాంకు అధికారులు చెప్పారు. వారి వద్దకు కూడా కొంతమంది సామాన్య ప్రజలు ఈ విషయాలను అడుగుతున్నారని పాత నోట్లు చెల్లవనడం శుద్ధ అబద్ధమని వారు స్పష్టం చేశారు. ఆర్బిఐ కానీ కేంద్ర ప్రభుత్వం గానీ పాత వంద నోట్లు చెల్లవంటూ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదని, ఇలాంటి వదంతులు నమ్మవద్దని వాళ్లు ప్రజలకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

విశాలాంధ్ర విశాఖపట్నం
పేజి : 2
ఆదివారం 24, మార్చి, 2024

పాలకుల నిర్లక్ష్యంతో మసక బారుతున్న విశాఖ ప్రతిష్ట

రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకటరావు

విశాలాంధ్ర - పెందుర్తి: ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అతి పెద్ద నగరంగా ఉన్న విశాఖపట్నం 2014 తర్వాత అభివృద్ధిలో వెనకబడిపోయిందని రాష్ట్ర కాంగ్రెస్ ఓబిసి డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకటరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీలు ప్రజలను భ్రమల్లో ఉంచి ఓట్లు దండుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. నగరం అభివృద్ధి చెందాలంటే కొన్ని అంశాలు ఖచ్చితంగా అమలు చేయాలని వివరించారు. రాష్ట్ర విభజన చట్టం సంపూర్ణంగా అమలు చేయాలని, విశాఖలోని ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాలని, స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటాయించాలని ప్రభుత్వ విద్య, వైద్యం బలోపేతం చేయాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖకు తలమానకంగా నిలిచే ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని పూర్తిగా మెరుగు పరచాలన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకు సేవలందిస్తున్న కేజీహెచ్ నేడు మౌలిక వసతులు లేక డాక్టర్లు, సిబ్బంది కొరతతో విలవిలలాడుతుందన్న మూల వెంకట్రావు వైద్యం మీద పెడుతున్న ఖర్చు రానురాను తగ్గించేయడంతో కేజీహెచ్ కళావిహీనంగా మారిందని వాపోయాడు.

పర్యావరణంగా చాలా సమస్యలు ఎదుర్కొంటున్న విశాఖలో ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజలు నివసించడానికి వీలులేని నగరంగా మారిపోతుందన్నారు. ఉపాధికోసం విశాఖకు వస్తున్న వారి సంఖ్య నానాటికి పెరుగుతుండటంతో మురికివాడల సంఖ్య ఎక్కువైందన్నారు. అందరికీ గృహవసతి అనే నినాదంతో ఏర్పడిన విఎంఆర్డిఏ నేడు పెద్ద రియల్ ఎస్టేట్ సంస్థగా మారిపోయిందని ఎద్దేవా చేశారు. అందరికీ మెరుగైన ఉపాధి కల్పన ద్వారానే ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందుతుందని, అది ఒక్క కాంగ్రెస్ తోనే సాధ్యమని ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ మూల వెంకటరావు స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో విశాఖ ప్రజలు విజ్ఞతతో ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

డ్రగ్స్ రాజధానిగా విశాఖ

– బీజేపీ ఉత్తర అభ్యర్థి విష్ణు కుమార్ రాజు

విశాలాంధ్ర బ్యూరో – విశాఖపట్నం: ప్రశాంత విశాఖ నేడు గంజాయి మాదక ద్రవ్యాల రాజధానిగా మారుతోందని బీజేపీ ఉత్తర నియోజకవర్గ అభ్యర్థి విష్ణు కుమార్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సీతమ్మ ధారలో గల బీజేపీ ఉత్తర నియోజక వర్గ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం 2019 తరువాత ఇలా తయారు అయ్యిందన్నారు. డ్రగ్స్ కంటైనర్ విజయవాడ చిరునామాతో వచ్చిందని, పదో తరగతి విద్యార్థులు కూడా గంజాయి సేవిస్తున్నారని, గంజాయి మత్తులో పోలీసుల మీద కూడా దాడులు జరుగుతున్నాయన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత మాత్రమే డ్రగ్స్ కంటైనర్ బయట పడిందని, వైసీపీ దీనిని కులాలకు ఆపాదించడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ మీద బురద జల్లడం అన్యాయమని, డ్రగ్స్ కంటైనర్ పురంధేశ్వరి వియ్యంకుడు కంపెనీ అనడం సరికాదన్నారు. సిబిఐ సమగ్ర దర్యాప్తు చేయాలని, త్వరలో ఎవరు జైలుకి వెళతారు అన్నది తేలుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉత్తరంలో గెలుపు తనదే అని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి విశాఖ జిల్లా అధ్యక్షుడు మేడ పాటి రవీంద్ర మాట్లాడుతూ విశాఖలో సినీ ఫక్కీలో 25 వేల కిలోల మాదక ద్రవ్యాలు బయట పడడం దేశం ఉలిక్కి పడిందన్నారు. గతంలో విడిపోయిన పార్టనర్స్ మీద విమర్శలు చేయడం సరికాదని, కోడ్ వచ్చిన తరువాత కూడా వైసీపీ నేతలు వేసిన రంగులు, ఫ్లెక్సీలు తొలగింపు చేయలేదన్నారు.

24 నుంచి ఐపీఎల్ టికెట్ల విక్రయాలు

వైజాగ్ కేంద్రంగా ఈ నెల 31, ఏప్రిల్ 3న ఐపీఎల్ మ్యాచ్

ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం వెల్లడి

విశాలాంధ్ర - పీఎం పాలెం: విశాఖ నగర పరిధిలో పీఎం పాలెం డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహించనున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మ్యాచ్‌లకు సంబంధించి ఈ నెల 24 నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయించనున్నట్లు ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఏప్రిల్ 3న ఢిల్లీ క్యాపిటల్స్-కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య జరగనున్న మ్యాచ్ కోసం 24వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటల నుంచి, ఈ నెల 31న ఢిల్లీ క్యాపిటల్స్-చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య జరగనున్న మ్యాచ్‌కు 27వ తేదీ నుంచి పేటీఎం, పేటీఎం ఇన్‌సైడర్, ఢిల్లీ క్యాపిటల్స్ వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లో టికెట్లను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన టికెట్లను పీఎం పాలెంలో ఉన్న స్టేడియం 'బి' గ్రౌండ్, నగరంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెడెమ్షన్ కౌంటర్లలో ఏప్రిల్ 3వ తేదీ మ్యాచ్‌కు 26 తేదీ నుంచి, ఈ నెల 31వ తేదీ మ్యాచ్ కోసం 27వ తేదీ ఉదయం 11 గంటల నుంచి రెడీమ్ చేసుకోవచ్చు.

టికెట్ల ధరలు ఇలా..

రూ.7,500, రూ. 5,000, రూ.3,500, రూ.3,000, రూ. 2,500, రూ. 2,000, రూ.1,500, రూ.1,000 విలువ చేసే టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని ఏసీఏ పాలకవర్గ సభ్యులు తెలియజేశారు.

దూర్యవిద్య నాణ్యతలో రాజీ లేదు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: దూరవిద్యలో అందించే కోర్సులు, నిర్వహణలో రాజీ పడకుండా విద్యార్థుల సంఖ్యను పెంపుదల చేయడానికి కృషి చేయాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. శనివారం ఉదయం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో దూరవిద్యలో సంస్కరణలు అంశంపై నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో దూరవిద్య కేంద్రం స్టడీ సెంటర్ల నిర్వాహకులు, కళాశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి మాట్లాడుతూ సరైన దిశలో చేసే సంస్కరణలు భవిష్యత్తులో మంచి ఫలితాలను ఇస్తాయన్నారు. అప్రంటిస్‌షిప్, ఎంటర్‌ప్యూనర్‌షిప్ దిశగా యువతను పడిపించాల్సిన అవసరం ఉందన్నారు. యువతను సాధికారత దిశగా నడిపించాలని సూచించారు. విద్యరంగంలో పనిచేస్తున్న వారంతా సేవా దృక్పధంతో నడచుకోవాలని సూచించారు. పారదర్శకత, నిజాయితీని తాము గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించడం, బలోపేతం చేయడం ఎంతో అవసరమాన్నరు. భవిష్యత్తులో స్వల్పకాలిక కోర్సుల ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. దూరవిద్యలో చదివే విద్యార్థులకు సైతం రానున్న కాలంలో ప్లేస్‌మెంట్స్ కల్పించే దిశగా కృషిచేస్తామన్నారు. కేంద్రం సంచాలకులు ఆచార్య కె.విశ్వేస్వర రావు మాట్లాడుతూ పరీక్షల్లో ఓఎంఆర్ జవాబు ప్రశ్నాపత్రాలను ప్రవేశ పెట్టడం జరుగుతుందన్నారు. నాణ్యతను నిరంతరం మెరుకు పరచుకుంటూ ముందుకు సాగాలన్నారు. రానున్న కాలంలో ఆన్‌లైన్ కోర్సులకు విపరీతమైన ఆదరణ ఏర్పడుతుందన్నారు. ప్రస్తుతం అన్ని సేవలకు ఆన్‌లైన్‌లో చెల్లింపులు జరిపే సదుపాయం కల్పించామన్నారు. ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ మాట్లాడుతూ ఎస్‌డిఈని అభివృద్ధి చేసిన విధానం చాలా బాగుందన్నారు. లక్షమంది విద్యార్థులకు సేవలు అందించడం లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి, ఎస్‌డిఈ అసోసియేట్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా దూరవిద్య కేంద్రం ఆచార్యుడు జయరామ్ రచించిన రెండు బిఈడి పుస్తకాలను వీసీ ఆవిష్కరించారు.

జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ విజేత గాజువాక

విశాలాంధ్ర - విశాఖపట్నం: విశాఖ జర్నలిస్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ శనివారము తో ముగిసింది. ఆంధ్ర మెడికల్ కళాశాల గ్రౌండ్స్ లో నిర్వహించిన ఈ పోటీల్లో గాజువాక జట్టు విన్నర్‌గా నిలిచింది.. ఆతిధ్య జట్టు రన్నర్ కప్‌ను దక్కించుకొంది. ముగింపు వేడుకలకి సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం సలహా మండలి సభ్యులు, జాతీయ జర్నలిస్ట్‌ల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబు ముఖ్య అతిధిగా హాజరై విజేతలకి ట్రోఫీ లు అందజేశారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ నిరంతరం పని ఒత్తిడితో ఉండే జర్నలిస్టులకు ఇటువంటి క్రీడా పోటీలు వల్ల శారీరక దేహ దారుఢ్యం మానసిక ప్రశాంతత కలుగుతుంది అన్నారు. ఎప్పటికప్పుడు పరవాడ గాజువాక గోపాలపట్నం. పెందుర్తి విశాఖపట్నంలో ఈ టోర్నల్ నిర్వహించడం వల్ల. అనేకమందికి ఆడే అవకాశం కలుగుతుంది అన్నారు. జర్నలిస్టులకు. తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన వాల్మీకి నాగరాజు మాట్లాడుతూ. గత కొద్ది రోజులుగా తాను అనేక టోర్నమెంట్లు నిర్వహించాను అన్నారు. భవిష్యత్తులో ఈ అసోసియేషన్ ద్వారా మెగా టోర్నమెంట్ నిర్వహించేందుకు. ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. విశాఖ జర్నలిస్టుల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ రామకృష్ణ. కార్యదర్శి అనిల్. పలువురు సభ్యులు క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాసేపు బ్యాటింగ్ చేసి శ్రీనుబాబు క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

క్షయ వ్యాధిని తరిమేద్దాం

నేడు క్షయ వ్యాధి దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రతి సంవత్సరం మార్చి 24న ప్రపంచ క్షయ (టీబి) వ్యాధి దినోత్సవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి గురించి అవగాహన కార్యక్రమాలు ప్రభుత్వాలు తూ తూ మంత్రంగానే నిర్వహి స్తున్నాయి. విశాఖలో టీబీ ఆసుపత్రికి రోజు పదుల సంఖ్యలో రోగులు వస్తూనే ఉంటారు. మనం క్షయ వ్యాధిని అంతం చేయగలం అనే థీమ్ తో ముందుకు వెళ్తున్నారు. ఇప్పటికీ మన దేశంలో ప్రతి రోజూ 1400 మందికి పైగా ఈ వ్యాధి వల్ల మరణిస్తున్నారంటే ఈ వ్యాధి ఎంత ప్రాణాంతకరమో మనం అర్థం చేసుకోవచ్చు. ఈ వ్యాధికి నివారణ, చికిత్స ఉన్నా వ్యాధి గురించి సరైన అవగాహన లేకపోవడం వల్ల వ్యాధి నిర్ధారణ, చికిత్సలో మరియు టిబి సమూల నిర్మూలనలో ఎన్నో అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఈ క్షయ వ్యాధి 'మైకో బాక్టీరియం ట్యుబర్కులోసిస్' అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. ఊపిరితిత్తులు లేదా గొంతు టిబి ఉన్న రోగి దగ్గినప్పుడు లేదా మాట్లాడినప్పుడు వెలుబడే తుంపరలు ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి పీల్చినప్పుడు ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. టిబి వ్యాధి సాధారణంగా ఊరిపితిత్తులకు సంక్రమిస్తుంది. కొన్ని సార్లు ఈ వ్యాధి మెడ చుట్టూ ఉన్న లింఫ్ గ్రంథులకు (లింఫ్ నోడ్ టిబి), వెన్నెముకకు (స్పైన్ టిబి), మెదడు (టిబి మెనింజైటిస్), గుండెకు, ఎముకలకు మరియు కీళ్లకు ఇలా మన శరీరంలో ఏ అవయవానికైనా రావచ్చు. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారు ఈ వ్యాధి బారిన పడతారు. ఊపిరితిత్తుల టిబి వచ్చిన వారికి దీర్ఘకాలికంగా దగ్గు (రెండు వారాలకు మించి), గళ్ల పడడం, జ్వరం, ఛాతీనొప్పి, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, కొన్నిసార్లు దగ్గినప్పుడు రక్తం పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు ఉన్నవారు సరైన సమయంలో సంప్రదిస్తే, వారికి ఛాతి ఎక్స్‌రే లేదా సి.టి స్కాన్, గళ్ల పరీక్ష మరియు టిబి రెసిస్టెన్స్ వంటి వివిధ పరీక్షలు నిర్వహించి ఈ వ్యాధిని గుర్తిస్తారు. సరైన సమయంలో వ్యాధి నిర్ధారణ చేస్తే మందులతో ఈ వ్యాధిని వంద శాతం నయం చేయవచ్చు. అయితే ఈ చికిత్స సమయం 6 నెలల వరకు ఉంటుంది. ఈ 6నెలల సమయంలో, పల్మోనాలజిస్ట్ వైద్యుని పర్యవేక్షణలో క్రమం తప్పకుండా మందులను వేసుకోవాలి. కొంత మంది కొన్ని వారాల చికిత్స అనంతరం జ్వరం, దగ్గు వంటి లక్షణాల నుండి ఉపశమనం పొందాక, వైద్యులను సంప్రదించకుండా మందులు వేసుకోవడం మానేస్తారు. ఇలాంటి వారిలో మందులకు లొంగని టిబి (డ్రగ్ రెసిస్టెంట్ టిబి) లేదా టిబి జబ్బు రెండోసారి రావడం, ఊపిరితిత్తులలో దీర్ఘకాలిక సమస్యలు వేధించడం జరగచ్చు. డ్రగ్ రెసిస్టెంట్ టిబి వచ్చిన వారు ద్వితీయ శ్రేణి టిబి మందులు 9 నుండి 24 నెలల వరకు వాడాల్సివస్తుంది. ఈ చికిత్సలో వాడే మందులకు ఒకింత దుష్ప్రభావాలు ఎక్కువ కనుక, తరుచూ రక్త పరీక్షలు,గుండె పరీక్షలు, వినికిడి మరియు కంటి పరీక్షలు చేయాల్సి వస్తుంది. టిబిని త్వరగా గుర్తించడం, 6 నెలల చికిత్స క్రమం తప్పకుండా వాడడం ద్వారా చాలా వరకు ప్రమాదకర డ్రగ్ రెసిస్టెంట్ టిబి పెరగకుండా నియంత్రివచ్చు. మాస్క్ ధరించడం, చేతులను శుభ్రంగా కడుక్కోవడం, దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు చేతి రుమాలు అడ్డుపెట్టుకోవడం వంటి జాగ్రత్తల ద్వారా టిబిని అరికట్టవచ్చు. మనమందరం బాధ్యతతో వ్యవహరించి టీబి ని సమూలంగా నిర్మూలిద్దాం.

ఇఫ్తార్ విందులో కె.కె.రాజు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ 53వ వార్డు పరిధి డాక్టర్ జాకీర్ హుస్సేన్ నగర్ పార్క్ వద్ద 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ ఆధ్వర్యంలో స్థానిక ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసీపీ ఉత్తర నియోజక వర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముస్లింలకు రాష్ట్రం లో వైసీపీ తరపున ఏడు అసెంబ్లీ టిక్కెట్లు ఇచ్చారని, వైఎస్ఆర్ కూడా ముస్లింల సంక్షేమం కోసం విశేష కృషి చేశారన్నారు. ముస్లిం సోదరుల సమక్షంలో నామినేషన్ వేస్తానని, రంజాన్ పవిత్ర మాసం అన్నారు. మహ్మద్ ప్రవక్త సూక్తులు పాటించాలి అని ఆయన కోరారు. 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలి మాట్లాడుతూ వార్డులో ఆస్పత్రి, రోడ్ల నిర్మాణం కోసం కృషి చేస్తున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేత ఎస్ఏ రహమాన్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, పిసీపిఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, వైసీపీ 53 వార్డు అధ్యక్షుడు వుజ్జు వెంకట్ రెడ్డి, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఏఐ, హైపర్ కనెక్టివిటీని ప్రారంభించనున్న శాంసంగ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: శాంసంగ్ ఎలక్ట్రానిక్స్‌లో డివైస్ ఎక్స్‌పీరియన్స్ డివిజన్ హెడ్ జోంగ్-హీ జే హెచ్ హాన్ ఏఐ, హైపర్ కనెక్టివిటీని అందుబాటులో తీసుకురానున్నట్లు చెప్పారు. ముంబైలోని జియో వరల్డ్ ప్లాజాలో శాంసంగ్ బీ కే సీ స్టోర్ ప్రారంభించిన తర్వాత మొదటిసారి సందర్శించారు, టెక్-అవగాహన ఉన్న వినియోగదారులకు ఏఐ, హైపర్ కనెక్టివిటీని తీసుకురావడం ద్వారా భారతీయ మార్కెట్ పట్ల కంపెనీ నిబద్ధతను నొక్కిచెప్పారు. టెలివిజన్‌లు మరియు డిజిటల్ ఉపకరణాల నుండి స్మార్ట్‌ఫోన్‌ల వరకు దాని ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో అంతటా శాంసంగ్ యొక్క తాజా ఏ ఐ ఆవిష్కరణలను అనుభవించ వలసిందిగా అతను వినియోగదారులను ఆహ్వానించారు. ఏఐ ఎల్లప్పుడూ అనుచితంగా నేపథ్యంలో ప్రజల రోజువారీ జీవితాలను మెరుగుపరచడానికి కనెక్ట్ చేయబడిన సాంకేతికతలను ప్రారంభిస్తుందన్నారు..

గెలాక్సీ ఏ 55 5జి, గెలాక్సీ ఏ35 5జిలను ఆవిష్కరించిన శాంసంగ్

విశాలాంధ్ర -విశాఖ సిటీ: భారతదేశపు అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్ , ఈరోజు అద్భుతమైన ఆవిష్కరణలతో కూడిన గెలాక్సీ ఏ55 5జి మరియు గెలాక్సీ ఏ35 5జిలను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. నూతన ఏ సిరీస్ మొబైల్ పరికరాలు గొరిల్లా గ్లాస్ విక్టస్ం రక్షణ, ఏఐ ద్వారా మెరుగుపరచబడిన కెమెరా ఫీచర్‌లు మరియు అనేక ఇతర కొత్త ఫీచర్‌లతో పాటు ట్యాంపర్-రెసిస్టెంట్ సెక్యూరిటీ సొల్యూషన్, శాంసంగ్ నాక్స్ వాల్ట్‌తో సహా బహుళ ప్రతిష్టాత్మక ఫీచర్స్ తో సహా మరెన్నో నూతన ఫీచర్స్ ను కలిగి ఉంటాయి. లిహెచ్‌డీఎఫ్‌సీ , వన్ కార్డు , ఐడిఎఫ్సి ఫస్ట్ బ్యాంక్ కార్డు లపై రూ. 3000 బ్యాంక్ క్యాష్‌బ్యాక్‌తో పాటు 6 నెలల నో కాస్ట్ ఈఎంఐ ఆప్షన్‌లతో సహా అన్ని ధరలు. ప్రత్యామ్నాయంగా, శాంసంగ్ ఫైనాన్స్ ప్లస్ అన్ని ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ భాగస్వాముల ద్వారా కస్టమర్‌లు గెలాక్సీ ఏ 55 5%+%ని నెలకు కేవలం రూ. 1792కి మరియు గెలాక్సీ ఏ 35ని నెలకు కేవలం రూ. 1723కి సొంతం చేసుకోవచ్చు.

ఐసిఐసిఐ ప్రూ గ్యారేంటెడ్ పెన్షన్ ప్లాన్‌తో అన్ని విధాల ఉపయుక్తం

విశాలాంధ్ర -విశాఖ సిటీ: భారతదేశంలో వడ్డీ రేట్లు ప్రస్తుత స్థాయిల నుండి రాబోయే కొద్ది నెలల్లో తగ్గుతాయని పలువురు మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత అందిస్తున్న ప్లాన్‌లో ఐసిఐసిఐ ప్రూ గ్యారంటీడ్ పెన్షన్ ప్లాన్ కి ఆదరణ ఉంది. కస్టమర్‌లకు ప్రస్తుత 7 శాతం వడ్డీ రేటు , యాన్యుటీ ప్రోడక్ట్‌లో తమ పెట్టుబడిని లాక్-ఇన్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తోంది. కాబట్టి ఇప్పుడు యాన్యుటీ ప్రోడక్ట్‌లో ఇన్వెస్ట్ చేయడం కస్టమర్‌లకు ప్రయోజనం చేకూరుస్తుంది. జీవిత బీమా కంపెనీలు మాత్రమే అందించే పెన్షన్ లేదా యాన్యుటీ ఉత్పత్తులు గ్యారెంటీగా క్రమ పద్దతిలో జీవితకాల ఆదాయాన్ని అందిస్తాయి. కొనుగోలు సమయంలో వడ్డీ రేటు లాక్-ఇన్ చేయబడుతుంది. పదవీ విరమణ పొందినవారు వడ్డీ రేటు ఒడిదుడుకుల వల్ల ప్రభావితం కాని స్థిరమైన ఆదాయాన్ని ఇష్టపడతారు, వార్షిక లేదా పెన్షన్ ఉత్పత్తులు ఉత్తమ ఎంపిక, ఇవి ఆర్థికంగా స్వతంత్రంగా ఉండటానికి సాధారణ ఆదాయాన్ని అందిస్తాయి.

ఘనంగా వేగి దివాకర్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పెందుర్తి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మీడియా సెల్ జిల్లా కన్వీనర్ వేగి దివాకర్ జన్మదిన వేడుకలు శనివారం పెందుర్తిలో ఘనంగా జరిగాయి. జిల్లా పార్టీ అధ్యక్షుడు గొంప గోవిందరావు, పెందుర్తి నియోజకవర్గం కన్వీనర్ ఆడారి రమేష్ నాయుడు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ షఫీఉల్లా, జిల్లా కార్యదర్శి కొమ్మోజు లక్ష్మోజీ, మండల పార్టీ అధ్యక్షులు ముక్కా రామునాయుడు, గౌరీ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు అళ్ళ రాము తదితరులు దివాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు సమక్షంలో దివాకర్ కేకు కట్ చేసి పంపిణీ చేశారు.

భీమిలి అసెంబ్లీ టికెట్ సందీప్‌కే ఇవ్వాలి

మండల పార్టీ ప్రెసిడెంట్ తమ్మిన అప్పలరాజు

విశాలాంధ్ర - ఆనందపురం: అసెంబ్లీ బరిలో అభ్యర్థిగా సందీప్ పంచకర్లకు స్థానం కల్పించినట్లయితే విజయకేతనం ఎగరవేస్తారని భీమిలి నియోజకవర్గం లో కూటమిలో భాగంగా అసెంబ్లీ అభ్యర్థి టికెట్ను జనసేన ఇన్చార్జ్ డాక్టర్ సందీప్ పంచకర్లకు కేటాయించాలని ఆనందపురం మండల పార్టీ ప్రెసిడెంట్ తమ్మిన అప్పలరాజు డిమాండ్ చేశారు. భీమిలి నియోజకవర్గం పరిధిలో పలు సవాళ్ను ఎదుర్కొని వైసీపీ నాయకులు ప్రశ్నలకు దీటుగా సమాధానం చెప్పిన ఏకైక నాయకుడని అలాంటి యువకుడుకి టికెట్ కేటాయించినట్లయితే భీమిలి నియోజకవర్గంలో ఉన్న సమస్యలను తన గొంతుతో అసెంబ్లీలో గళం వినిపిస్తారని, ప్రత్యర్థి ఎవరైనా సరే సందీప్ ముందు ఓటమి అంగీకరించక తప్పదని ప్రజాబలం జనసేన వైపు ఉందని అందువల్ల తప్పనిసరిగా భీమిలి టిక్కెట్ జనసేన కేటాయించాలని అప్పలరాజు డిమాండ్ చేశారు.

నేవీ పెన్షన్ అడ్వైజరీ డెస్క్ సిబ్బందికి మద్దతు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖలో నేవీ ఫౌండేషన్ ఏజీఎం, జీసీఎం కార్యక్రమానికి నేవీ స్టాఫ్ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరి కుమార్ అధ్యక్షత వహించి పలువురు అనుభవజ్ఞులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అనుభవజ్ఞుల నుంచి సందేశాలను స్వీకరించి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పెన్షన్లపై ప్రస్తావించారు. నేవీ పెన్షన్ అడ్వైజరీ డెస్క్ సిబ్బందికి తమ మద్దతును అందించింది.

ప్రపంచ ఆప్టి మెట్రో దినోత్సవం

విశాలాంధ్ర - పెందుర్తి: ప్రపంచ ఆప్టి మెట్రో దినోత్సవ వేడుకలు జీవీఎంసీ 93వ వార్డు నాయుడు తోట వద్ద గల శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. స్కూల్ ఆఫ్ ఆప్టి మెట్రో విద్యార్థులు నగరంలోని ఆర్కే బీచ్ వద్ద ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే దృశ్య రూపకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్, స్కూల్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు నస్రీన్, సువర్ణ, శిరీష చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. శంకర్ ఫౌండేషన్ ట్రస్టీలు ఆత్మకూరి విజయ్ కుమార్, కృష్ణ కుమార్, జనరల్ మేనేజర్ రాధాకృష్ణన్, డిప్యూటీ జనరల్ మేనేజర్లు కే బంగార్రాజు, వి.రమేష్ ఆప్టి మెట్రో విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. స్కూల్ ఆఫ్ ఆప్టి మెట్రో ఇన్చార్జ్ భువన కళ్యాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పన్ను సరే...మంచినీళ్లెక్కడ

విశాలాంధ్ర - ఆనందపురం: ఇంటింటికి వీధి కొళాయిలు రావడం కోసమై బోర్లు వేసి మూడేళ్లు గడిచిన ఇప్పటివరకు వాటి పన్నులు వస్తున్నాయి గాని నీరు మాత్రం కనిపించని వైనం విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలంలో గంభీరం పంచాయితీ కాలింగుళ కాలనీలో చోటు చేసుకుంది. ప్రస్తుత వైస్ ఎంపీపీ బొట్ట రామకృష్ణ ధనలక్ష్మి మూడేళ్ల క్రితం స్థానిక నాయకులు బోర్లు వేయించి మీ కాలనీకి నీటి సమస్య లేకుండా చేస్తామని ఆనాడు హడావిడిగా బోరు వేసి దాని పక్కనే ఒక ట్యాంక్ నిర్మించి దీని నుంచి ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యం కలిగే విధంగా చేకూరుస్తానని చెప్పి ఏళ్ళు గడుస్తున్నా కానీ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. పంచాయతీ వారు మాత్రం పన్ను రూపంలో ప్రతి ఇంటికి నీటి పన్ను వేస్తున్న తరుణం పన్ను తీసుకున్న పరవాలేదు కానీ నీరు వస్తే బాగుండని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుత రానున్న ఎన్నికల్లో ప్రభుత్వం ఉండొచ్చు మారొచ్చు కానీ పనులు మాత్రం ముందుకు సాగడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.